క్లుప్తంగా

కాళ్ల సొసైటీ సీఈవోగా బాబ్జి బాధ్యతల స్వీకరణ



సీఈఓగా బాధ్యతలు అందుకుంటున్న వెంకట రామారావు(బాబ్జి)

కాళ్ల: కాళ్ల విశాల సహకార పరపతి సంఘం సీఈవోగా గనిశెట్టి వెంకటరామారావు(బాబ్జి) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ సుంకర భోగేశ్వరరావు, సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం నూతన సీఈవో బాబ్జి మాట్లాడుతూ రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

21, 22 తేదీల్లో 'వలంటీర్లకు వందనం'

ఉండి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్ రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సేవలు అందించిన వలంటీర్‌లను సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఈనెల 22వ తేదీన ఉదయం 9 గంటలకు మహదేవపట్నం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్‌లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

కంటి చికిత్సకు వాకర్స్ సహాయం



మందులు అందజేస్తున్న సభ్యులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవుని చిక్కాలకు చెందిన కోట వరలక్ష్మికి రూ.20 వేలు విలువైన మందులను వాకర్స్ సభ్యులు సోమవారం అందజేశారు. వరలక్ష్మి పేదరికంతో బాధపడుతూ కంటికి వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం వాకర్స్ సభ్యుల దృష్టికి రావడంతో విజయవాడలో ఆమెకు శస్త్ర చికిత్స చేయించే ఏర్పాట్లు చేశారు. అలాగే రూ.20 వేలు విలువైన మందులను అందజేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమా శంకర రావు, సభ్యులు పవన్ కుమార్, జవ్వాజి కల్యాణ్, అందే జైపాల్ నాయుడు, మల్లిపూడి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని సుబ్బారాయుడు గుడి వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖ బులియన్ మర్చంట్ పట్నాల కిషోర్ కుమార్, రమావాణి దంపతులతో ప్రత్యేక పూజలు, హోమాలు చేయించారు. ఆలయంలో శ్రీరామచంద్రుడు, సీతాదేవి, లక్ష్మణ, ఆంజనేయ, విఘ్నేశ్వర, కుమారస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అడపా కొండయ్య, యాళ్ల దుర్గాప్రసాద్, మార్నెళ్ల మాణిక్యాలరావు, ఆచంట నారాయణ, తులా రామలింగేశ్వరరావు, బొమ్ము మధుసూదన్, ఆచంట రామకృష్ణ, అంబటి సాయి, గవర రెడ్డినాయుడు, శిద్దిరెడ్డి రాధాకృష్ణ, పులపర్తి లాల్ తదితరులు పాల్గొని భక్తులకు సేవలందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు.

భార్యపై భర్త దాడి

ఉండి: భార్యపై తన భర్త చాకుతో దాడి చేసి గాయపరచిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మహదేవపట్నం గ్రామానికి చెందిన సరస్వతికి,పెంటపాడు మండలం ఉమామహేశ్వరం గ్రామానికి చెందిన అయినగంటి వెంకటేశ్వరరావుకు కొన్నేళ్ళ క్రితం వివాహమైంది.అనంతరం అతని భార్య సరస్వతి గల్ఫ్‌దేశం వెళ్ళి ఈ యేదాది జనవరిలో తిరిగి అతని వద్దకు వచ్చింది.కొంతకాలం సాఫీగానే సాగిన సంసారంలో వారిమధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో ఆమె తన పుట్టింటికి మహదేవపట్నం గ్రామంలోని భవానీపురం వచ్చేసింది.అయితే ఈ నెల 18వ తేదీన భవానీపురానికి వచ్చిన వెంకటేశ్వరరావు భార్యతో గొడవ పడి చాకుతో గాయపరచాడు.దీంతో ఆమెను భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- పాలకోడేరులో వలంటీర్లకు సత్కారం



పాలకోడేరులో వలంటీర్లను సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, చిత్రంలో ఎంపీపీ చంటి రాజు

పాలకోడేరు: వలంటీర్లు ప్రజలకు అందించే సేవలకు విలువ కట్టలేమని, కేవలం వారిని ప్రోత్సహించేందుకే ప్రభుత్వం అవార్డులు అందిస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పాలకోడేరులో సోమవారం ఉత్తమ వలంటీర్లకు పురస్కారాలు అందజేసి మొమెంటోలు, శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పీవీఎల్ మాట్లాడుతూ పాదయాత్రలో పేదలకు మాటిచ్చిన ప్రకారం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి స్థితిగతులను మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు గతంలో టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు తమ పార్టీ వాళ్లకు, తమ బంధువులకు మాత్రమే పథకాలు అందించే వారన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ల వ్యవస్థ ప్రవేశపెట్టిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి సిఫార్సులు, లంచాలు లేకుండా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. అయితే ఇది జగనన్న ఎన్నో ఆశలు పెట్టుకుని నమ్ముకున్న వలంటీర్ల వల్లనే ఇది సాధ్యమైందన్నారు. నవరత్నాల పథకాలు నూరు శాతం విజయవంతంగా పేదలకు అందుతున్నాయంటే అది వలంటీర్ల కృషి వల్లనే అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని ఈ సందర్భంగా పీవీఎల్ వలంటీర్లకు పిలుపునిచ్చారు. సర్పంచుల మండల కార్యదర్శి బొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ప్రజాప్రతినిధుల ద్వారా పథకాలు సిఫార్సు చేయబడేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, వలంటీర్ ఆ బాధ్యత తీసుకునే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి అమలు చేయడం అద్భుతమని అన్నారు. కరోనా సమయంలో కూడా వలంటీర్ల సేవలు అమోఘమన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని, అదేవిధంగా ఉండి నియోజకవర్గం నుంచి పీవీఎల్ నరసింహారాజును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, జెడ్పీటీసీ పెద్దిశెట్టి లక్ష్మీతులసి సుబ్రహ్మణ్యం, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్ష కార్యదర్శులు చంటిరాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీతులసి, కొత్తపల్లి కాశీవిశ్వనాథరాజు, కొత్తపల్లి గోపాలకృష్ణంరాజు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డీఆర్ స్వర్ణలత, గెద్దం జోషి, బొక్క రాంబాబు, గుండు నాగేశ్వరరావు, ఎంపీటీసీలు షేక్ పాపసాహెబ్, కాటూరి శాంతకుమారి, పెన్మెత్స వెంకటలక్ష్మి కొత్తపల్లి స్వాతి, కె నాగలక్ష్మి, పాలా జ్యోతి, సర్పంచ్‌లు కడలి నాగేశ్వరి, కడలి విజయలక్ష్మి, చింతపల్లి వెంకటనారాయణ, పాలా రాధాకృష్ణ ఎంపీడీవో టి అనూహ్య నాయకులు కార్యకర్తలు, వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో లైఫ్ స్కిల్స్‌కు కృషి చేయాలి



మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నందున ఉపాధ్యాయులు విద్యార్థుల్లో లైఫ్ స్కిల్స్ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త పి.శ్యామ్‌సుందర్ అన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్(పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్లో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్ సమావేశాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ సీహెచ్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ఓ ఎ.రామకోటేశ్వరరావు, ఎంఈవో వేంద్ర వెంకటేశ్వరరావు, స్కూల్ హెచ్ఎం ఎంజే సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ కుటుంబరావు



బేతపూడి హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో విద్యా రంగంలో ఎవరూ చేయని విధంగా విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ కొట్టి కుటుంబరావు అన్నారు. భీమవరం మండలం బేతపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు సర్కారు పాఠశాలలను అభివృద్ధి చేయకుండా ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలకు రెడ్ కార్పెట్ పరిచారని గుర్తుచేశారు. దీంతో ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం వేలకు వేలు ఖర్చుపెడుతూ ఆర్థికంగా కుంగిపోయేవారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే సర్కారు పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసి విద్యార్థులకు ఏకరూప దుస్తువులు, షూస్, ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్నం నాణ్యమైన జగనన్న గోరు ముద్ద ద్వారా పౌష్టికాహారం, ఆంగ్ల మాధ్యమంలో బోధన, బైజూస్ కంటెంట్‌తో రూ.30 వేలు విలువ చేసే ట్యాబ్‌లు ఇవ్వడంతో సర్కారు పాఠశాలల విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడుతున్నారన్నారు. అంతేకాక అమ్మఒడి ద్వారా ఏటా రూ.15 వేలు, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన ఇలా ఎన్నో పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. అంతేకాక కంటి వెలుగు ద్వారా నేత్ర పరీక్షలు చేస్తున్నారన్నారు. అనంతరం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడియం వెంకటేశ్వరరావు, సమతం ఉమా మహేశ్వరరావు, బుంగా ప్రహ్లాదుడు, కురెళ్ల వెంకట సుబ్బారావు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జుత్తిగ సోమేశ్వరుని సేవలో ఎమ్మెల్యే గ్రంధి



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి, కొవ్వూరి చిన్నారెడ్డి

పెనుమంట్ర: ప్రభుత్వ చీఫ్ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సోమవారం జుత్తిగలోని శ్రీ ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఉదయాన్నే ఆలయానికి విచ్చేసిన ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా కాలభైరవుడిని దర్శించుకున్న ఆయన ఆలయం చుట్టూ ప్రదక్షిణ అనంతరం గణపతి ఆలయంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సోమేశ్వరుని ఆలయంలో ఆయన గంటారావాన్ని మోగిస్తుండగా వేదపండితులు వేమూరి ఫణీంద్ర శర్మ ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన పార్వతి అమ్మవారికి, సోమేశ్వరునికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మూడు గంటల కుపైగా ఆలయ ఆవరణలోని ఉపాలయాలను దర్శించుకున్న అనంతరం గ్రామ సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

భీమవరంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా భీమవరం మరాఠీ సంఘం ఆధ్వర్యాన సోమవారం ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని పలు వీధుల్లో శివాజీ విగ్రహం, చిన్నారుల శివాజీ వేషధారణలతో, సంఘ సభ్యులు కాషాయి రంగు తలపాగాలు ధరించి, జెండాలతో నిర్వహించిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మరాఠీ సంఘ నాయకులు చంద్రశేఖర్, శ్రీవిద్య మాట్లాడుతూ 16వ శతాబ్దంలో జనిృంచిన ఛత్రపతి శివాజీ 16వ ఏట నుంచే సైనికుడిగా మారి మరాఠీ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని మొగలు సామ్రాజ్యాన్ని తుద ముట్టించే వరకు పోరాటం సాగించారన్నారు. ఛత్రపతి శివాజీ సైనికులకు ఇచ్చిన శిక్షణ, క్రమశిక్షణ, మహిళలకు అందించిన రక్షణ చరిత్రలో నిలిచిపోయిందని, అందువల్లే నేటికీ శివాజీని మరాఠీ ప్రజలు ఆరాధ్య దైవంగా కొలుస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు విట్టు, దాదా శేట్, షావుకారు శేట్, విఠోబా, గేవర్ చంద్, అల్లు శ్రీనివాస్, కడియం ప్రసాద్, అరసవల్లి మణికంఠ, పవన్ శేట్, సుశీల్, రామశేట్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి పాస్టర్లు మార్గదర్శకులుగా ఉండాలి



ఉండిలో సమావేశమైన మండల పాస్టర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు

ఉండి: దేవుని సేవకులు (పాస్టర్లు) శాంతియుత సమాజస్థాపనకు కృషి చేయాలని కాళ్ల యూపీఎఫ్ అధ్యక్షుడు సోడదాసి కరుణప్రకాష్ అన్నారు. సోమవారం ఉండి చిక్కాల వీరన్న నగర్‌లోని పాస్టర్ జీ లూథరన్ చర్చిలో మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దైవస్తుతి చేస్తూ కీర్తనలు, ప్రత్యేక పాటలు ఆలపించారు. అనంతరం ప్రపంచశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కరుణప్రకాష్ వాక్యోపదేశం చేశారు. యేసుక్రీస్తు చూపించిన మార్గంలో మనమంతా ప్రయాణం చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరు మానవత్వం, దయాగుణం, ప్రేమ, క్షమాపణ వంటి గుణాలను కలిగి ఉండేలా యేసుక్రీస్తు వాక్యాలు బోధించాలన్నారు. సమాజానికి పాస్టర్లు మార్గదర్శకులుగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో యూపీఏ అధ్యక్షుడు సోడదాసి వరదానం, గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఈలి డేవిడ్‌మార్కు, కే డేవిడ్‌రాజు, ఉపాధ్యక్షుడు బుడితి జోసఫ్, సంయుక్త కార్యదర్శి నీతిపూడి యోహాను, సువర్ణరాజు, కటికితల మార్టిన్ లూథర్ తదితరులు పాల్గొన్నారు.



యనమదుర్రులో మధ్యాహ్నం వేళ మండుటెండలో నడిచి వెళ్తున్న మహిళలు



దొంగపిండిలో తెల్లవారు జామున మంచు దుప్పటి దృశ్యం

పగలు ఎండ.. రాత్రి మంచు

భీమవరం అర్బన్: పగటి పూట విపరీతమైన ఎండ.. రాత్రి మంచుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 10 గంటలు దాటగానే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సాయంకాలం 6 గంటలు దాటగానే చలుగాలులతో ఉదయం 9 గంటల వరకు తీవ్రమై మంచుదుప్పటి కప్పేస్తుంది. దీంతో పలువురు వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ఉదయం పూట పాఠశాలలకు వెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచులో ఎక్కువగా తిరిగితే జలుబు, వైరల్ జ్వరాలు వస్తాయని, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మరోవైపు వరి చేలకు అగ్గితెగులు, చెరువులో చేపలకు తాటాకు తెగులు, వనామీ రొయ్యలకు వైరస్, విబ్రియో వ్యాప్తి చెందుతుందని పలువురు రైతులు చెబుతున్నారు.

సేల్స్ ఫోర్స్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న శ్రీనివాసన్

భీమవరం: సేల్స్ ఫోర్స్ రిలేషన్ మేనేజ్మెంట్‌పై పూర్తి అధ్యయనం జరిగితే వ్యాపారంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెన్నై ఐసీటీ అకాడమీ సీనియర్ టెక్నికల్ ట్రైనర్ టి.శ్రీనివాసన్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సేల్స్ ఫోర్స్ ఎడ్యుకేటర్స్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాం పేరుతో ఐదు రోజులపాటు నిర్వహించే అధ్యాపక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కస్టమర్ సేవా మార్కెటింగ్‌తో పాటు ఇతర ప్రక్రియలు నిర్వహించడానికి వివిధ సేవలను అందించేలా కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీని అధ్యాపకులు అధ్యయనం చేస్తే విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ అందించవచ్చునన్నారు. కార్యక్రమానికి ఏపీ ఎంఎల్ ఇన్‌చార్జ్ హెడ్ జీఎస్‌వీ శిరీష, భీమవరం శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ఫర్ ఉమెన్, తాడేపల్లిగూడెం వాసవి ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు హాజరయ్యారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో ఉద్యోగులకు ప్రయోజనం



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

భీమవరం: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్(పీఎల్ఐ)తో ఉద్యోగులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టాఫీస్ టి.సుబ్రహ్మణ్యం చెప్పారు. సోమవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సిబ్బందికి నిర్వహించిన పీఎల్ఐ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీఎల్ఐ పథకంలో బోనస్ ఎక్కువగా ఉండటమే కాకుండా కట్టాల్సిన నగదులో కూడా చివరి దశకు వచ్చేసరికి కొంత తగ్గింపు కూడా ఉంటుందన్నారు. దీనిలో ఉద్యోగులకు అనువైన ఎండోమెంట్ ఇన్సూరెన్స్, హోల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి ఎన్నో స్కీమ్స్ ఉంటాయన్నారు. ఐపీపీబీ మేనేజర్ బీఎస్ కళ్యాణ్ మాట్లాడుతూ ఐపీపీబీ స్కీంలో చేరితే యాక్సిడెంట్ బెనిఫిట్స్‌తో పాటు హెల్త్ స్కీమ్స్, వెల్ఫేర్ ఫ్రీ చెకప్ తదితర సదుపాయాలన్నీ ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల హెచ్ఆర్ పవన్‌కుమార్, సబ్ పోస్ట్ మాస్టర్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొండాడలో కేంద్ర బృందం పర్యటన



సమావేశమైన కేంద్ర బృందం

కాళ్ల: కాళ్ల మండలం బొండాడ గ్రామంలో సోమవారం సాయంత్రం కేంద్ర బృందం పర్యటించింది. గ్రామంలో జలజీవన్, స్వచ్ఛ భారత్‌లో జరుగుతున్న కార్యక్రమాలను బృందం పరిశీలించింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రక్షిత మంచినీటి సరఫరా నాణ్యత పరీక్ష విధానాలను తెలిపారు. అదేవిధంగా గ్రామంలో మంచినీరు, పారిశుధ్యం ప్రాముఖ్యతపై విలేజ్ కమిటీతో మాట్లాడారు. గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం పాఠశాలలను పరిశీలించారు. కేంద్ర బృంద సభ్యులు రామ్ సేస్ నాగి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ధనానంద్, ఏఈ శ్రీనివాస్, ఫణి,రాఘవేంద్ర, ఎంపీడీవో భాస్కరరావు, గ్రామ సర్పంచ్ మన్నే వరలక్ష్మి, వైస్ ఎంపీపీ మన్నె నాగలక్ష్మి, పార్టీ నాయకులు మన్నె నాగరాజు, మన్నె శ్రీనివాస్, మందపాటి రవి, పెన్మెత్స రంగరాజు, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం

ఉండి: ఓ ఇంట్లో చోరీకి చేసిన ప్రయత్నాలు ఫలించక పోవడంతో అగంతకుడు పరారయ్యాడు. ఎస్ఐ ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం..మండల శివారు కలిగొట్లలో యశోద కృష్ణ ఒంటరిగా నివశిస్తున్నాడు. సోమవారం రాత్రి సుమారు 10గంటల సమయంలో కిరాణా దుకాణాన్ని మూసివేసి ఇంట్లోకి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకొని బెడ్ రూంలోకి వెళ్లాడు. అప్పటికే ఆ ఇంట్లో ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తి కృష్ణను గట్టిగా పట్టుకోవడంతో అతను గట్టిగా కేకలు వేశాడు. వెంటనే చుట్టుపక్కల వాళ్లు ఇంటికి రావడాన్ని చూసి అగంతకుడు పరారయ్యాడు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

లైన్‌మన్‌పై ఫిర్యాదు

ఆకివీడు: గుమ్ములూరు గ్రామంలో విద్యుత్ సమస్యలు తెలియజేసినా విద్యుత్ లైన్‌మన్ రమేష్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని గ్రామ సర్పంచ్ కోట అనంత లక్ష్మి సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. పాడైపోయిన విద్యుత్ స్తంభం ఉన్న ప్రాంతంలో మెయిన్ పైప్‌లైన్ ఉందని, వాటర్ వర్క్స్ ఫిట్టర్ వచ్చిన తరువాత స్తంభం తొలగించాలని లైన్‌మన్‌కు సూచించినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మంచినీరు అందించే మెయిన్ పైప్‌లైన్ పాడైపోయి నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడిందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే విధంగా స్పందనలో మరో ఆరు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు.

చదరంగం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: చదరంగం మేధస్సును పెంచుతుందని, ఉచిత చెస్ కోచింగ్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని డాన్ బాస్కో స్కూల్ ప్రిన్సిపాల్ అరవింద్ అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన గ్రంధి వెంకటేశ్వరరావు మెమోరియల్ చెస్ కోచింగ్ క్యాంప్‌ను సోమవారం స్కూల్లో ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల పట్ల విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ఉపాధి అవకాశాలు పొందవచ్చునన్నారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ దివంగత వెంకటేశ్వరరావు పేరుతో పట్టణంలోని అన్ని స్కూల్స్‌లో చెస్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న తోట భోగయ్య, గంటా సుందర్ కుమార్

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని 29వ వార్డు ప్రకాష్ నగర్‌లో గ్రంధి శ్రీనివాస్ సేవా సమితి ఆధ్వర్యంలో 70 మంది పేద బాలబాలికలకు నిత్యావసర వస్తువులు, భోజనం ప్యాకెట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య మాట్లాడుతూ గ్రంధి శ్రీనివాస్ సేవా సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గంటా సుందర్‌కుమార్, సేవా సమితి అధ్యక్షురాలు గంటా అనితా రాణీ, గొల్లరాజ్‌కుమార్, ఆలమూరి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన కడలి సుబ్బారావు అనే వ్యక్తి మద్యం అక్రమంగా విక్రయిస్తుండటంతో అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.రాజు తెలిపారు.